23,24 తేదీల్లో హెమటాలజీపై సదస్సు

హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైశేత్వర్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి11: బ్లడ్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే నివారించే అవకాశం ఉంటుందని యశోద హాస్పిటల్ హెమటాలజిస్ట్ డాక్టర్ గణేష్ జైశేత్వర్ అన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెమటాలజీపై ఈ నెల 22, 23 తేదీల్లో హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్లడ్ డిజార్డర్స్, బ్లడ్ క్యాన్సర్ నివారణకు నూతన ఆవిష్కరణ తీసుకువచ్చేందుకు ''డెక్కన్ హెమటో లింక్ 2.0 -2025'' పేరిట ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

సమగ్రసాగు ఎంతో మేలు

వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ: దేశంలో సమగ్ర సాగు ఎంతో మేలని, రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ఉప కులపతి అల్దాస్ జానయ్య అన్నారు. దేశం లో మూస పద్ధతిన ఇప్పటికీ సాగు కొనసాగుతుందన్నారు. దేశంలో దాదాపు సగానికి పైగా రైతులు వ్యవసాయ ఆధారిత రంగాలపైనే ఆధారపడి ఉన్నారన్నారు. ఈ మధ్యకాలంలో సంభవిస్తున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తరుగుతున్న కమత విస్తీర్ణం, నిలకడలేని దిగుబడులు, పెరుగుతున్న సాగు వ్యయం వలన రైతులు అధికంగా దెబ్బతిన్న డమే కాకుండా వ్యవసాయంపై ఆధారపడే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. వ్యవసాయంలో సంభవిస్తున్న ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సమగ్ర సుస్థిర వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

దేశంలో చిన్న, సన్నకారు రైతులు స్థానికంగా ఉన్న వనరులను అనుసరించి వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలైన పాడి పశువులు, కోళ్ల ఉద్యాన పంటలు, పశుగ్రాసుసాగు, చేపల పెంపకం పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చున్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

జలమండలిశాఖ ఎండీ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



జలమండలి శాఖ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, ఫిబ్రవరి 11: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యల్లో తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు. దానిలో భాగంగా మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కొన్ని రోజులుగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ వివరాలను సైతం బీఆర్ఎస్ నాయకులు అధికారులకు వివరించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు సీతారాం తెలిపారు.

- మణికొండ పురపాలక సంఘం పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిన కారణంగా బోర్లు ఎండి పోవడం పురజనులంతా కేవలం జలమండలి సరఫరా చేసే నీటి మీద ఆధార పడటంతో, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే తగినన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.
- నెమలినగర్‌లో స్థలం కేటాయించిన చోట 0.5 ఎం.ఎల్.డి నిర్మించడం, గోల్కొండ హిల్స్‌కాలనీ వారు రిజర్వాయర్ నిర్మించుట కొరకు తగినంత స్థలం కేటాయించుట కొరకు ముందుకొచ్చిన కారణంగా ఆ స్థలంలో కూడా రిజర్వాయర్ నిర్మిస్తే చుట్టు పక్కల ఉన్న కాలనీలకు మంచినీటి సదుపాయం కలుగుతుంది.
- ప్రస్తుతం నీటి కనెక్షన్ల కొరకు అర్జీ పెట్టుకొని సాంకేతిక కారణాల వల్ల జలమండలి వారు కనెక్షన్ ఇవ్వలేని కారణంగా వారికి తాత్కాలిక క్యాన్ నంబర్లు ఇవ్వాలి.
- మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొన్ని గేటెడ్ కమ్యూనిటీలకు డిస్ట్రిబూషన్ లైన్ వేయకుండా మెయిన్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చిన కారణంగా రాబోవు కాలంలో మణికొండ నివాసులు మంచినీటి ఎద్దడి ఎదుర్కొనే అవకాశం ఉంది. దీని కారణంగా డిపార్‌మెంట్ ఆదాయ వనరుల్లో కోతపడుతుంది కావున డిస్ట్రిబూషన్ లైన్లు వేయాలి.
- పంచవటితో పాటు ఇతర కాలనీలలో ఒక గంట సమయం నీటి సరఫరా చేయవలసి ఉండగా 40 నుంచి 45 నిమిషాలు మాత్రమే మంచినీరు వస్తున్న కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

కావున పైన తెలిపిన విషయాలపై తక్షణమే స్పందించి జల మండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పార్టీ తరపున అధ్యక్షుడు సీతారాం, నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, ఉపేందర్‌నాథ్‌రెడ్డి,ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాంత్, గోరుకొంటి విఠల్, రామ సుబ్బ రెడ్డి, భాను చందర్, ఆరీఫ్ మొహమ్మద్, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బండ్లగూడలో పుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేతలను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు రావుల కోళ్ల నాగరాజు తదితరులు

అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండోరోజు పుట్‌పాత్‌ల ఆక్రమణలను కూ ల్చివేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి పోలీస్ అకాడమీ వరకు రోడ్డు కిరువైపులా పుట్‌పాత్ ఆక్రమణలను కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు.ఈ సందర్భంగా పుట్‌పాత్ ఆక్రమణ దారులకు అధికారులకు మధ్య వాగ్వాదా లు చోటు చేసుకున్నాయి.అధికారులు గట్టి పోలీస్ బందోబస్త్ మధ్య ఆక్రమణలను తొలగించారు.

చిరువ్యాపారులకు అండగా బీఆర్ఎస్ శ్రేణులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పుట్ పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న విషయం తెలుసుకున్న బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. అయినా అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

తేనెటీగల వల్ల అధిక లాభాలు

వాతావరణ పరిస్థితులు అనుకూలం • డిపార్ట్‌మెంట్ హెడ్ డా. రజినీ కాంత్

తేనెటీగల పెంపకంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: తేనెటీగల పెంపకంలో తగిన మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం తేనెటీగల పెంపకం విభాగం హెడ్, ప్రొ. రజినీకాంత్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. దక్షిణ భారత దేశంలో లభించే తేనెకు అధిక పోషక విలువలతో పాటు ఔషధ గుణాలుంటాయని, ఇక్కడి వాతావరణ పరిస్థితులు తేనె పెంపకానికి అనుకూలంగా ఉంటుందన్నారు. తేనెటీగల పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. తేనెటీగల పెంపకానికి సొంత భూమి అవసరం లేదన్నారు. వ్యవసాయ పనులకు అడ్డు రాదు, పెంచే వారి కుటుంబాల్లో తేనెను ఉపయోగిస్తే ఆహార సమతుల్యం మెరుగవుతుందన్నారు. పెంపకానికి శారీరక శ్రమ అంతగా అవసరం ఉండదు. మహిళలు, చిన్నారులు కూడా పెంచవచ్చన్నారు. భారీ పెట్టుబడితో పనిలేదు, ప్రేములు, తదితర పరికరాల అవసరం ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో తేనెటీగల జాతులు, శాస్త్రీయ పద్ధతి లో తేనెటీగల పెంపకం , తేనెపట్టు నిర్వహణ, తేనె తీసే విధానం, లభ్యమయ్యే ఉత్పత్తుల మార్కెటింగ్ , మెళకువల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. యువ రైతులు ఎక్కువ ఆసక్తి చూపడంతో త్వరలోనే మరో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డా. వి. సునీత తెలిపారు. పదిరోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఉచిత భోజన వసతితో పాటు అనంతరం సర్టిఫికెట్, నగరంలో పరికరాలు లభించే అడ్రస్‌లు తదితర వివరాలు తెలియజేస్తామన్నారు. వివరాలకు 9490916195 సంప్రదించాలని సూచించారు.

రెడీ మిక్స్ వాహనం బోల్తా

అతివేగంగా వెళ్తున్న రెడీమిక్స్ వాహనం బోల్తా కొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లో వేగంగా వెళ్తున్న రెడీ మిక్స్ వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. – బంజారాహిల్స్,ఫిబ్రవరి 11:

వర్సిటీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిమాచల్ ప్రదేశ్ మనాలిలోని అటల్‌బిహారీ వాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెరింగ్ ,అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగిన నేషనల్ సర్వీస్ స్కీమ్ – నేషనల్ అడ్వెంచర్ క్యాంప్‌లో ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 8 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గత ఏడాది నవంబర్15-24 పది రోజుల పాటు నిర్వహించిన క్యాంపులో భాగంగా రాక్ క్లైంబింగ్ , రివర్ క్రాసింగ్, ట్రెకింగ్ తదితర అంశాలలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. అందుకు గాను హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేసింది. ఈ సందర్భంగా మంగళవారం వీసీ అల్దాస్ జానయ్య , వర్సిటీ పరిధిలోని పరిపాలనా భవనంలో వారికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు . – వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి, 11

వైన్ షాప్ వద్ద యువకుడు మృతి

కేసు నమోదు చేసుకున్న పోలీసులు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 11: వైన్ షాప్ వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాలు.. ఏపీలోని అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన తల్లే కొడుకులు నిర్మల, వినోద్(28) చాలా ఏండ్ల క్రితం పొట్ట కూటి కోసం నగరానికి వచ్చారు. మోతీనగర్ సమీపంలోని కబీర్ నగర్ బస్తీలో అద్దె ఇంట్లో ఉంటూ రోజువారీ కూలీ పనులు చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వినోద్ గంట సేపటికే శవమై కనిపించాడు. బోరబండ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ లక్ష్మీవైన్స్ ఎదురుగా శవం ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శవ పంచనామా అనంతరం వినోద్ మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

16న నాగర్‌కర్నూల్‌లో సగర శంఖారావం

వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, శేఖర్ సాగర్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11: సగర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న మధ్యాహ్నం 3గంటలకు నాగర్‌కర్నూల్‌లోని జడ్పీ మైదానంలో సగర శంఖారావం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ సగర తెలిపారు. మంగళవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సగర శంఖారావం కార్యక్రమ పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు మణిమంజరితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ కురుమ, సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ఆంజనేయులు సగర, దండి శేఖర్ సగర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, ఎం. రవి, ఆవుల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంలో వైశ్యులకు సీట్లు కేటాయించాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11 : ఆర్యవైశ్యులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో పదివేలకు పైగా ఆర్యవైశ్యుల జనాభా ఉందని, 2004 నుంచి కాంగ్రెస్ పార్టీ వైశ్యులకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఎమ్మెల్సీ, 11 మున్సిపల్ చైర్మన్లు, అయిదు కార్పొరేషన్లు ఇచ్చిందన్నారు. ఓవర్సీస్ ఎడ్యుకేషన్ లో సైతం ఆర్యవైశ్య విద్యార్థులకు అవకాశం కల్పించాలని, బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలో ఎన్టీఆర్ స్టేడియంలో ఆర్యవైశ్య రాజకీయ రణభేరి పేరుతో మహాసభ నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో వైశ్య వికాస వేదిక ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి రామ్ నరేశ్, సముద్రాల రమేశ్, ఈశ్వరయ్య, ప్రభు దయాకర్ రావు, ఉప్పల శ్రావణ్ కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

అమీర్‌పేట్ మెడిస్టార్ దవాఖాన నిర్వాకం

మధురానగర్ పోలీసులకు వైద్యురాలి ఫిర్యాదు, కేసు నమోదు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 11: ఆమె ఓ సర్కారీ దవాఖాన వైద్యురాలు. ఐదేళ్ల క్రితం ప్రైవేట్ దవాఖానతో పాటు.. డయాగ్నస్టిక్స్ కన్సల్టెంట్ గా ఏడాది పాటు పనిచేసి మానేశారామె. అక్కడ లేని లేడీ డాక్టర్ పేరుతో ఇప్పటికీ పేషెంట్లకు రిపోర్టులు జారీ చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి తన పేరును దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడిన సదరు ప్రైవేటు దవాఖాన, డయాగ్నస్టిక్ సెంటర్ పై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఆ వైద్యురాలు. పోలీసుల కథనం ప్రకారం..మోతీనగర్‌కు చెందిన కె.సంపూర్ణ (51) సంగారెడ్డి లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో పాథాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్. 2018 నుంచి 2019 మధ్య కాలంలో అమీర్‌పేట్‌లోని మెడిస్టార్ హాస్పిటల్, స్మార్ట్ డయాగ్నస్టిక్స్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా ఏడాదికాలం పనిచేసి మానేశారు అక్కడ లేకున్నా ఐదేళ్ల నుంచి ఇప్పటికీ ఆ డాక్టరమ్మ సంపూర్ణ పేరుతో పేషెంట్లకు మెడికల్ టెస్టుల రిపోర్టులను జారీ చేస్తున్నారు. తాను మెడిస్టార్ హాస్పిటల్, స్మార్ట్ డయాగ్నస్టిక్స్ లో మానేసి ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ తన పేరును దుర్వినియోగం చేస్తూ రోగులకు రిపోర్టులు ఇస్తున్నారని తెలిసి కంగుతిన్న బాధిత వైద్యురాలు సంపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. తన పేరుతో చేస్తున్న అక్రమాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు యూత్ కన్వెన్షన్

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీఎల్ శ్రీనివాస్

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 11: స్వామి వివేకానంద అమెరికాలోని చికాగోలో జరిగే సర్వమత సమ్మేళనానికి వెళ్లేముందు తొలి ప్రసంగం చేసి132 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 13న సికింద్రాబాద్, ఆర్పీరోడ్డులో ఉన్న మహబూబ్ కాలేజీలోని ఆడిటోరియంలో యూత్ కన్వెన్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలేజీ అధ్యక్షుడు పీఎల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం నరేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఫిబ్రవరి 13, 1893న మహబూబ్ కళాశాలలో అడుగు పెట్టారని, ఆయన పాద స్పర్శతో భాగ్య నగరం పవిత్రభూమిగా మారిందన్నారు. ఎందరో ప్రముఖులు మేధావులను దేశానికి ఈ విద్యాసంస్థ అందించిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మతో పాటు స్వామి ప్రభోదానంద, శ్రీ రామకృష్ణ మఠంలోని ఇతర సీనియర్ సన్యాసులు పాల్గొంటారని తెలిపారు.

గాంధీ పార్కులో.. మరమ్మతులు

మణికొండ, ఫిబ్రవరి 11 : మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్ మహాత్మా గాంధీ పార్క్ లో ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసే కాలనీ వాసులకు పార్కులో పాదచారులు (వాకింగ్ ట్రాక్) కొంతకాలంగా చిన్న చిన్న గులకరాళ్లు తేలడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన స్థానిక మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్ మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించడంతో మంగళవారం రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

డిజిటల్ ప్యానెల్ బోర్డు విద్యాబోధన అమలు

డిజిటల్ తరగతులపై అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఆర్. రోహిణి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి11: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ స్లాట్ ప్యానల్(ఐఎస్పీ) బోర్డులు ప్రవేశ పెడుతున్నారు. ఆధునిక పద్ధతులతో విద్యాబోధన అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠాలు బోధించడంలో పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ ఈ మల్టీపర్పస్ డిజిటల్ ప్యానల్ బోర్డు విద్యా బోధనకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు ఐఎస్పీ బోర్డులతో విద్యా బోధనపై జిల్లా వ్యాప్తంగా 183 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం యూసుఫ్‌గూడా ప్రభుత్వ పాఠశాలలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈ ఓ) ఆర్. రోహిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జోన్ ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయులకు 2 రోజుల పాటు నిర్వహించే ట్రైనింగ్ కార్యక్రమంలో డీఈఓ రోహిణి పాల్గొని మొదటి సెషన్‌లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు డిజిటల్ ప్యానల్ ద్వారా పాఠాలు ఎలా చెప్పాలి, బ్లాక్‌బోర్డు, ఐఎస్పీగా ఉపయోగపడే ఈ మల్టీపర్పస్ బోర్డును ఎలా వినియోగించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ప్యానల్ బోర్డుల ద్వారానే బోధన సాగించాలని ఆదేశించారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ, ట్రైనింగ్ ఇన్‌చార్జి బి.నరసింహ, జిల్లా రిసోర్స్ పర్సన్ (ట్రైనర్) ఎం. రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్‌తో పాటు ఇంటి పేరు ఆధారంగా..

రాగిపోగుల నవతేజ(ఫైల్)

బంజారాహిల్స్,ఫిబ్రవరి 11: పుట్‌పాత్ మీద నిద్రిస్తున్న సమయంలో అదుపుతప్పిన కారు వచ్చి ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన గుర్తుతెలియని వ్యక్తిని పదేళ్ల క్రితం సేకరించిన ఫింగర్ ప్రింట్స్‌తో పాటు అతడి ఇంటి పేరు ఆధారంగా గుర్తించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 25న అర్ధరాత్రి దాటిన తర్వాత బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్స్ ఆస్పత్రి ఎదురుగా ఓ కారు అదుపుతప్పి పుట్‌పాత్ మీదకు ఎక్కిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం ఉస్మానియా మార్చురీలో భద్రపర్చారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మాడే సాంకేత్ శ్రీనివాస్ అలియాస్ తేజతో పాటు అతడికి కారు ఇచ్చిన కారు యజమాని హర్షవర్ధన్ అనే నటుడిని బంజారాహిల్స్ పోలీసులు రెండు రోజుల తర్వాత అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మృతుడి ఆచూకీ కోసం వేట..

ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీని తెలుసుకునేందుకు బంజారాహిల్స్ పోలీసులు వేట ప్రారంభించారు. దీనిలో భాగంగా స్థానికులను వాకబు చేయగా అతడి గురించి ఏమీ తెలియలేదు. కాగా పోస్టుమార్టం సమయంలో మృతదేహానికి సంబంధించిన ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించితెలంగాణ పోలీసుశాఖకు చెందిన ఫింగర్ ప్రింట్స్ బ్యూరోలో అప్‌డేట్‌చేశారు. కొన్నిరోజుల తర్వాత ఫింగర్ ప్రింట్స్‌బ్యూరో నుంచి వచ్చిన సమాచారం మేరకు మృతుడి వేలిముద్రలు కుషాయిగూడ పీఎస్ పరిధిలో 2015లో ఓ చోరీ కేసులో నిందితుడు రాగిపోగుల నవతేజ వేలిముద్రలతో సరిపోయాయని సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన బంజారాహిల్స్ అతడి చిరునామాకు వెళ్లగా అక్కడ ఎలాంటి ఆచూకీ దొరకలేదు. కాగా కుషాయిగూడలో నవతేజ ఇంటిపేరు రాగిపోగుల అని ఉండడంతో పాటు కర్నూల్ జిల్లా సొంతూరు అని తేలింది. దీంతో రాగిపోగుల అనే ఇంటిపేరుతో కర్నూల్ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఆరా తీశారు. ఇటీవల కర్నూల్ జిల్లా సిర్వేన్ మండలం కోటపాడు గ్రామంలో రాగిపోగుల అనే ఇంటిపేరుతో ఉన్నారని అక్కడి సర్పంచ్ ద్వారా బంజారాహిల్స్ పో లీసులకు తెలిసింది. దీంతో కోటపాడు గ్రామంలో వాకబు చేయగా సుమారు 30ఏళ్ల క్రితమే నవతేజ తల్లిదండ్రులు ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయారని తేలింది. కాగా ఊర్లోని వారి బంధువులు, మిత్రులతో మాట్లాడి కుటుంబసభ్యుల ఆచూకీ తీయగా మృతుడి కుటుంబం వివరాలు లభ్యమయ్యాయి. సెంట్రింగ్ పనులు చేసే రాగిపోగుల నవతేజ(39) పనిలో భాగంగా అప్పుడప్పుడు ఇంటినుంచి వచ్చి కొన్నాళ్ల పాటు సైట్‌ల వద్దే ఉంటాడని తేలింది. ఈ క్రమంలో బంజారాహిల్స్ సమీపంలోని సైట్‌లో పనిచేస్తూ పుట్‌పాత్ మీద నిద్రిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు మృతుడి సోదరులు నితిన్, నిఖిల్‌లకు మృతుడు నవతేజ మృతదేహాన్ని బంజారాహిల్స్ పోలీసులు అప్పగించారు. వేలిముద్రలతో పాటు ఇంటిపేరు ఆధారంగా అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన మృతుడి వివరాలను సేకరించిన బంజారాహిల్స్ ఎస్ఐ రమేష్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

17 నుంచి సెల్ఫ్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్‌లాంగ్వేజ్‌ట్రైనింగ్(సెల్ఫ్)లో ఈ నెల 17వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవీన్ సోడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం ఆరున్నర నుంచి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్ల